మెదక్
# టుడే
RNI NO: TELTEL/2023/88524
MEDAK TODAY
తెలుగు దిన పత్రిక....



## విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న మెదక్‌టుడే దినపత్రికలో విలేకరులుగా పనిచేయుటకు బ్యూరో, మండలలా , జిల్లాల, నియోజకవర్గ స్థాయిల్లో ఉత్సహవంతులైన యువతి,యువకులు కావలెను. కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

మెదక్ టుడే
RNI NO: TELTEL/2023/88524
తెలుగు దిన పత్రిక....

Call us now!
9494117870

12 మే 2026 మెదక్ పేజీలు : 4 వెల రూ : 2 ఎడిటర్ సిహెచ్ శివకుమార్ సంపుటి 02 సంచిక 130-

# తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుంది

**ప్రధాని సభ విజయంతో ఉత్సాహంలో ఎంపీ ఈటల రాజేందర్**

**ప్రజా సమస్యలు పట్టించుకునేది బీజేపీయేనని వ్యాఖ్య**

**స్వదేశీఉత్పత్తులవినియోగంపైమోదీపిలుపుగుర్తు చేసిన ఈటల**

**హైదరాబాద్,మే,11,(మెదక్ టుడే న్యూస్)**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన బహిరంగ సభ విజయవంతం కావడం తెలంగాణ రాజకీయాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కంటోన్మెంట్‌లోని గాయత్రి గార్డెన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని



సభకు భారీగా ప్రజలు తరలివచ్చారని, సభా ప్రాంగణం వెలుపల కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు ఉన్నారని పేర్కొన్నారు. గత పది రోజులుగా సహకరించిన మీడియా ప్రతినిధులకు ఈటల రాజేందర్ ధన్యవాదాలు తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి, సికింద్రాబాద్, రంగారెడ్డి జిల్లాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, వివిధ మోర్చాల నాయకులు, అపార్ట్‌మెంట్ పాలక మండళ్లు, ఉత్తర భారత సమాజం ప్రతినిధుల సహకారంతో సభ విజయవంతమైందన్నారు. ముఖ్యంగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు భారీగా హాజరయ్యారని వెల్లడించారు. ఈ సభతో రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో గెలిచేది బీజేపీయేనని ప్రధాని మోదీ సంకేతాలు ఇచ్చారని ఈటల వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను నిజంగా పట్టించుకునే ఏకైక పార్టీ బీజేపీయేనని పేర్కొన్నారు.తాను సంవత్సరంలో 365

2

# డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ

**- జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు**

**- విద్యార్థులకు ఉచిత స్కూల్ కిట్ల పంపిణీ**

**- గవర్నర్‌ను ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్,మే,11,(మెదక్ టుడే న్యూస్)**రాష్ట్రంలో వచ్చే జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యే



సందర్భంగా విద్యార్థులతో పొగాకు, మద్యం, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించనున్నట్లు ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో లోక్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు వివిధ వస్తువులతో కూడిన స్కూల్ కిట్లను పంపిణీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగ్, క్రీడా దుస్తులు, ఇతర అవసరమైన సామగ్రితో ఈ కిట్లు సిద్ధం చేస్తున్నట్లు గవర్నర్‌కు వివరించారు.విద్యార్థులతో నిర్వహించే ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని, స్కూల్ కిట్ల పంపిణీని లాంఛనంగా ప్రారంభించేందుకు గవర్నర్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. విద్యార్థుల్లో మాదకద్రవ్యాలపై అవగాహన పెంపొందించడం, వ్యసనాలకు దూరంగా ఉంచడం

2

కాకతీయుల శివాలయ ధ్వంసంపై

# హరీశ్ రావు ఆగ్రహం

**- అశోక్‌నగర్‌లో కూల్చివేతకు గురైన ఆలయ సందర్శన**

**- గుప్త నిధుల కోసమే తవ్వకాలు జరిగాయని ఆరోపణ**

**-వెంటనేఎఫ్ఐఆర్‌నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**వరంగల్,మే,11,(మెదక్ టుడే న్యూస్)**వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని



ఖానాపురం మండలం అశోక్‌నగర్ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం పేరుతో ధ్వంసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 800 ఏళ్ల కాకతీయుల నాటి శివాలయాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి హరీశ్ రావు సోమవారం సందర్శించారు. కూల్చివేతకు గురైన ఆలయ ప్రాంగణంలో స్థానికులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పర్యటనలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, శంకర్ నాయక్, దాస్యం వినయ్ భాస్కర్, ఆరూరి రమేష్, మాజీ

2

# ప్రధాని వ్యాఖ్యలపై పొన్నం ప్రభాకర్ విమర్శలు

**హైదరాబాద్,మే,11,(మెదక్ టుడే న్యూస్)**ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని తెలంగాణకు వస్తే రాష్ట్రానికి మేలు జరుగుతుందని ప్రజలు భావించారని, కానీ ఆయన ప్రజలకు భరోసా ఇవ్వాల్సింది పోయి భయాందోళనలు కలిగించేలా మాట్లాడారని ఆరోపించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రధాని వస్తే గౌరవప్రదంగా




2

# నిరుపేద పిల్లలకు నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం

**- ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఒడిలా తీర్చిదిద్దుతాం**

**- విద్యా రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెడతాం**

**- విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్న సీఎం**

**హైదరాబాద్,మే,11,(మెదక్ టుడే న్యూస్)**నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను వెనక్కి తగ్గకుండా అమలు చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన విద్యా వారోత్సవాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. కోర్ అర్బన్ ఏరియాలో రూ.1011 కోట్లతో నిర్మించనున్న "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల"కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలను అనాథలుగా చూడబోమని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంత జాగ్రత్తగా చూసుకుంటారో అదే రీతిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను చూసుకోవడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. పాఠశాలలు దేశ భవిష్యత్తు నిర్మాణ వేదికలని, ఆ వేదికలను పునరుద్ధరించే ప్రక్రియను ప్రారంభించామని పేర్కొన్నారు.ప్రపంచవ్యాప్తంగా విద్యా రంగంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని సీఎం వివరించారు. సిలబస్ మారుతోందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం పెరుగుతోందని, జాతీయ విద్యా విధానం మార్పులకు అనుగుణంగా తెలంగాణలో కూడా కొత్త విద్యా విధానం అమలు చేస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు సమగ్ర విద్యా విధానం అమలు చేయబోతున్నామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక





2

# చెరువులపై హైడ్రా కన్ను


**- 900 సీసీటీవీ కెమేరాలతో కట్టుదిట్టమైన నిఘా**

**- ఆక్రమణలు, మట్టి నింపివేతలకు చెక్**

**-ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌తో నిరంతర పర్యవేక్షణ**

**హైదరాబాద్,మే,11,(మెదక్ టుడే న్యూస్)**నగరంలోని చెరువుల పరిరక్షణ కోసం హైడ్రా భారీ స్థాయిలో నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. చెరువులను మట్టితో నింపడం, ఆక్రమణలకు పాల్పడడం, నిర్మాణ వ్యర్థాలు వేయడం వంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి 900 సీసీటీవీ కెమేరాలను ఏర్పాటు చేసింది. ఈ ఆధునిక నిఘా వ్యవస్థను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం ప్రారంభించారు. చెరువుల పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కెమేరాలను నేరుగా హైడ్రా కార్యాలయంలోని సర్వర్‌కు అనుసంధానం చేశారు. దీంతో చెరువుల వద్ద జరిగే ప్రతి కదలికను కంట్రోల్ రూమ్ నుంచే నిరంతరం పర్యవేక్షించే అవకాశం ఏర్పడింది. ఎవరైనా మట్టి పోయడం, చెరువులను ఆక్రమించేందుకు ప్రయత్నించడం, వ్యర్థాలు వేయడం వంటి చర్యలకు పాల్పడితే వెంటనే గుర్తించి చర్యలు తీసుకునేలా ప్రత్యేక వ్యవస్థను సిద్ధం చేశారు. ఇప్పటికే చెరువుల వద్ద లేక్ ప్రొటెక్షన్ బృందాలు పనిచేస్తున్నప్పటికీ, ఇప్పుడు సీసీటీవీ నిఘా అందుబాటులోకి రావడంతో పర్యవేక్షణ మరింత పటిష్టమైంది. మట్టి తీసుకువచ్చే వాహనాల వివరాలను కూడా కెమేరాల ద్వారా గుర్తించి వెంటనే అక్కడి బృందాలను





2

# బండి భగీరథ్ పోక్సో కేసుపై సీఎం రేవంత్ ఆగ్రహం

**డీజీపీని ప్రశ్నించిన ముఖ్యమంత్రి**

**ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని ఆదేశం**

**కేసుపై స్పందించిన బాలల హక్కుల కమిషన్**

**హైదరాబాద్,మే,11,(మెదక్ టుడే న్యూస్)**కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఈ వ్యవహారంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ నెల 8వ తేదీన ఫిర్యాదు అందినా ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని డీజీపీ సీవీ ఆనంద్ ను ప్రశ్నించారు. కేసులో వెంటనే విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి డీజీపీకి సూచించారు. ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను లోతుగా పరిశీలించి పూర్తి నివేదిక అందించాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఏర్పాట్లలో సిబ్బంది బిజీగా ఉండటంతో ఆలస్యం జరిగిందని డీజీపీ ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిసింది. కేసుకు సంబంధించిన వివరాలను కూడా సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.ఇదిలావుండగా ఈ కేసుపై తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కూడా స్పందించింది. కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి నగర పోలీస్ కమిషనర్ నుంచి పూర్తి వివరాలు తెప్పించుకున్నారు.



2

# వైద్యుల బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తాం

**- జీవో 38 ప్రకారమే ట్రాన్స్‌ఫర్ ప్రక్రియ**

**- గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్‌తో మంత్రి సమావేశం**

**- వైద్య విద్య, సేవల బలోపేతంపై దామోదర్ దృష్టి**

**హైదరాబాద్,మే,11,(మెదక్ టుడే న్యూస్)**ప్రభుత్వం జారీ చేసిన జీవో 38 ప్రకారం వైద్యుల బదిలీలను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో



మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.మంత్రి చాంబర్‌లో జరిగిన సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, జాయింట్ సెక్రటరీ అయేషా, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నరహరి, ప్రధాన కార్యదర్శి లాలూ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వైద్యులు గతంలో జరిగిన జనరల్ ట్రాన్స్‌ఫర్ల మాదిరిగానే ఈసారి కూడా బదిలీలను పారదర్శకంగా, ఆఫ్లైన్ విధానంలో నిర్వహించాలని కోరారు. టీజీడీఏ కార్యవర్గ సభ్యులకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారికి కూడా బదిలీల్లో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాల్లో పనిచేస్తున్న వైద్యులకు హైదరాబాద్ మెడికల్ కాలేజీల్లోకి బదిలీ అవకాశాలు ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారమే

2

# తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుంది

మొదటి పేజీ తరువాయి

రోజులు ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. త్వరలో నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ప్రధాని మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయిన తర్వాత దేశవ్యాప్తంగా బీజేపీ మరింత బలపడుతోందని ఈటల అన్నారు. తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రం అప్పుల ఊబిలో నుంచి బయటపడాలన్నా, రైతులు, విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావాలన్నా బీజేపీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ప్రజలు ఆశీర్వదిస్తే మెచ్చే పాలన అందిస్తామని హామీ ఇచ్చారు. స్వదేశీ ఉత్పత్తుల



వినియోగాన్ని పెంచాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపును ఈటల గుర్తు చేశారు. విదేశీ మారకద్రవ్యం వృథా కాకుండా చూసుకోవాలని ప్రధాని కోరుతున్నారని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ ప్రభావం కారణంగా అమెరికాలో కూడా పెట్రోల్, గ్యాస్ ధరలు పెరిగాయని వివరించారు. దేశ పరిస్థితులు ఎంత గంభీరంగా ఉన్నాయో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. "మేక్ ఇన్ ఇండియా", "మేడ్ ఇన్ ఇండియా" లక్ష్యాలతో దేశాన్ని స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు మోదీ కృషి చేస్తున్నారని తెలిపారు.రాజకీయ ప్రత్యర్థులపై కూడా ఈటల రాజేందర్ విమర్శలు గుప్పించారు. ప్రధాని రాష్ట్రానికి వచ్చినప్పుడు నిధులు అడిగి, తర్వాత విమర్శలు చేయడం సరికాదన్నారు. గతంలో కేసీఆర్ కూడా మోదీని ప్రశంసించి, తర్వాత విమర్శలు చేశారని గుర్తు చేశారు. "అలా మాట్లాడిన కేసీఆర్ పరిస్థితి ఏమైందో అందరికీ తెలుసు" అని వ్యాఖ్యానించారు. కేంద్రం నుంచి నిధులు వస్తున్నాయికాబట్టే రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. అధికారాలు వస్తాయి పోతాయి కానీ మాట శాశ్వతంగా నిలుస్తుందని రాజకీయ నాయకులు జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు.

# నిరుపేద పిల్లలకు నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

వసతులతో పాటు విద్యార్థులకు బలవర్ధక ఆహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. ప్రభుత్వ బడులు పిల్లలకు అమ్మ ఒడిలా ఉండాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకూడదని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయనున్నట్లు తెలిపారు.విద్యార్థుల కోసం ఖర్చు చేస్తున్న ప్రతి రూపాయి భవిష్యత్తరాలపై పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే భావితరాలు తయారుకావాలని, అందుకు ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. రాష్ట్రంలోని 19 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఉందని చెప్పారు.విద్యా రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టాలన్నదే తన ఆకాంక్ష అని సీఎం వెల్లడించారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 8.22 శాతం నిధులు కేటాయించామని, రాబోయే సంవత్సరాల్లో దాన్ని 15 శాతం వరకు పెంచే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. 10వ తరగతి తర్వాత ఇంటర్మీడియట్ స్థాయిలో డ్రాపౌట్స్ అధికంగా ఉన్నాయని గుర్తించి నర్సరీ నుంచి 12వ తరగతి వరకు కొనసాగే విద్యా విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. తొలి దశలో హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ఈ విధానాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉద్యోగాల కోసం నగరానికి వచ్చే నిరుపేద కుటుంబాల పిల్లలకు మెరుగైన



విద్య అందించేందుకు రూ.1700 కోట్ల అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేశామని వెల్లడించారు.విద్యా రంగంలో అంతర్జాతీయ ప్రమాణాలను తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని సీఎం చెప్పారు. జపాన్, సింగపూర్, వియత్నాం వంటి దేశాల్లోని విద్యా విధానాలను అధ్యయనం చేయడానికి ప్రతీ ఏడాది 500 మంది ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను విదేశాలకు పంపే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసే ఉపాధ్యాయులను ప్రభుత్వం ప్రత్యేకంగా సత్కరిస్తుందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అందించనున్న యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, ఇతర సామగ్రి కోసం ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, లోపాలు ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అత్యుత్తమ విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, మహ్మద్ అజహరుద్దీన్, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావుతో పాటు ప్రజాప్రతినిధులు, వైస్ చాన్సలర్లు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఒక్కొక్కరికి లక్ష రూపాయల ప్రోత్సాహక చెక్కులను అందజేశారు.

# వైద్యుల బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తాం

మొదటి పేజీ తరువాయి

బదిలీలు చేపడతామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వైద్య విద్యను బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇందుకు వైద్యుల పూర్తి సహకారం అవసరమని పేర్కొన్నారు.మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ ఆసుపత్రుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని బదిలీల ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి తెలిపారు. అడ్మినిస్ట్రేషన్, బోధన, క్లినికల్ సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా



చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాల్లోని ఆసుపత్రులు, మెడికల్ కాలేజీల్లో ఎక్కువకాలంగా పనిచేస్తున్న వారికి బదిలీల్లో ప్రాధాన్యం కల్పిస్తామని వెల్లడించారు. ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా సంస్కరణలు అమలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. వైద్యులకు అనుకూల వాతావరణం కల్పిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

# బండి సాయి భగీరథ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్,మే,11,(మెదక్ టుడే న్యూస్)**మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ పై పోక్సో చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మహిళా నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు వినతిపత్రం సమర్పించారు. కేసును నీరుగార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, ఘటనపై నిష్పక్షపాత విచారణ జరపాలని కోరారు. బాధితురాలి కుటుంబాన్ని వేధింపులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ మహిళా నేతలు ఆరోపించారు. ఈ వ్యవహారంలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై కూడా అనుమానాలు వ్యక్తం చేశారు. కేసు దర్యాప్తును ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ మహిళా కమిషన్



దృష్టికి తీసుకెళ్లారు. బాధితురాలి కుటుంబానికి రక్షణ కల్పించాలని, న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ వేగవంతం చేయాలని నేతలు డిమాండ్ చేశారు. మైనర్ బాలికల భద్రత విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, రాజకీయ ప్రభావాలకు లొంగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాల విషయంలో రాజీ ఉండకూడదని పేర్కొన్నారు. ఈ ఘటనపై ఇప్పటికే రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ పార్టీ నాయకులు వివిధ ప్రాంతాల్లో నిరసనలు నిర్వహిస్తూ అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఈ ఆరోపణలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబం నుంచి అధికారిక స్పందన వెలువడలేదు. వినతిపత్రాన్ని స్వీకరించిన మహిళా కమిషన్ అధికారులు విషయాన్ని పరిశీలిస్తామని తెలిపినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలుస్తోంది.

# డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ

మొదటి పేజీ తరువాయి

ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.పాఠశాల విద్యాశాఖ, పోలీసు శాఖ, ఈగల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్, ఇతర వ్యసనాల ప్రభావం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు సమిష్టిగా బాధ్యత తీసుకుని విద్యాసంస్థలను డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన పెంపొందించడమే ప్రభుత్వ ప్రధాన



ఉద్దేశమని అధికారులు తెలిపారు.

# ప్రధాని వ్యాఖ్యలపై పొన్నం ప్రభాకర్ విమర్శలు

మొదటి పేజీ తరువాయి

స్వాగతం పలికామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు. అయితే ప్రధాని "పెట్రోల్, డీజిల్ వాడొద్దు, బంగారం కొనొద్దు, వంట నూనె తగ్గించండి" వంటి వ్యాఖ్యలు చేయడం సరైందా అని ప్రశ్నించారు. ఒకవైపు దేశంలో సమర్థవంతమైన పాలన అందిస్తున్నామని చెబుతూ, మరోవైపు ప్రజలను ఆందోళనకు గురిచేసే ప్రకటనలు చేయడం తగదన్నారు.తెలంగాణకు కేంద్రం గత 12 ఏళ్లలో ఏమిచ్చిందో చెప్పాలని పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. మెట్రో రైలు, ట్రిపుల్ ఆర్, రేడియల్ రోడ్లు, కేంద్ర సంస్థలు వంటి అంశాలపై తెలంగాణ బీజేపీ నేతలు ఎప్పుడైనా కేంద్రాన్ని ప్రశ్నించారా అని నిలదీశారు. ఇతర రాష్ట్రాలు భారీ నిధులు తెచ్చుకుంటున్నాయని, తెలంగాణకు మాత్రం వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై కూడా మంత్రి స్పందించారు. బీజేపీ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ సీబీఐ విచారణ కోరుతున్నారని, అయితే రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు సిద్ధమని చెబితే




ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. తెలంగాణను అవమానించేలా బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని విమర్శించారు.కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన కేసుపై కూడా పొన్నం ప్రభాకర్ స్పందించారు. ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో నిష్పక్షపాత విచారణకు సహకరించాలని, కేంద్ర మంత్రి హోదాను ఉపయోగించి దర్యాప్తుపై ఒత్తిడి తీసుకురావొద్దని హెచ్చరించారు. బాధిత కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. పోలీసులు చట్టబద్ధంగా వ్యవహరించాలని, దోషులకు తప్పకుండా శిక్ష పడాలని స్పష్టం చేశారు. కుల గణన అంశాన్ని కూడా మంత్రి ప్రస్తావించారు. రాహుల్ గాంధీ ఒత్తిడి మేరకే దేశవ్యాప్తంగా కుల గణనపై చర్చ మొదలైందని పేర్కొన్నారు. జనగణనలో బీసీల వివరాలు నమోదు చేయాలని కేంద్రాన్ని కోరినప్పటికీ స్పందించలేదని ఆరోపించారు. తెలంగాణ బలహీన వర్గాలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.దేశ స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడిందని, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ దేశ ఐక్యత కోసం ప్రాణాలు అర్పించారని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అలాంటి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని మత, రాజకీయ వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. ప్రజలను విభజించే రాజకీయాల కంటే అందరికీ సమాన హక్కులు కల్పించే రాజకీయాలు అవసరమని వ్యాఖ్యానించారు.

# కాకతీయుల శివాలయ ధ్వంసంపై హరీశ్ రావు ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి

కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.ఆలయ సందర్శన అనంతరం మీడియాతో మాట్లాడిన హరీశ్ రావు, "రేవంత్ రెడ్డి పాలనలో బడులు ఆగడమే కాదు, గుడుల విధ్వంసం కూడా జరుగుతోంది" అని ఆరోపించారు. కాకతీయ గణపతిదేవుడు నిర్మించిన 800 ఏళ్ల చారిత్రక శివాలయాన్ని ఉద్దేశపూర్వకంగానే కూల్చేశారని విమర్శించారు. ఆలయ రక్షణ కోసం ఉన్న మట్టి ఆనకట్టను తొలగించి గర్భగుడిని ధ్వంసం చేశారని పేర్కొన్నారు. అర్ధరాత్రి సమయంలో 24 అడుగుల లోతు వరకు తవ్వకాలు జరిపారని, ఇది గుప్త నిధుల కోసం చేసిన చర్యేనని ఆరోపించారు. స్కూల్ నిర్మాణం కోసం పగటి పూట పనులు



చేయవచ్చని, రాత్రివేళ తవ్వకాలు ఎందుకు చేశారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పురావస్తు శాఖ జిల్లా అధికారి ఇచ్చిన ఫిర్యాదుపై ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.పురావస్తు శాఖ ఫిర్యాదు ఆధారంగా వెంటనే కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఆలయాన్ని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని, ఈ స్థలాన్ని పురావస్తు శాఖకు అప్పగించాలని కోరారు. తవ్వకాల్లో బయటపడిన వస్తువులపై సమగ్ర విచారణ జరపాలని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ టెండర్లలో భారీ అవినీతి జరిగిందని కూడా హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా 76 పాఠశాలల టెండర్లలో కోట్ల రూపాయల ప్రజాధనం దోపిడీ జరిగిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఇలాంటి అధిక శాతం ఎక్సెస్ టెండర్లు ఎప్పుడూ ఇవ్వలేదని పేర్కొన్నారు.

# చెరువులపై హైడ్రా కన్ను

మొదటి పేజీ తరువాయి

అప్రమత్తం చేస్తారు. ఆక్రమణలకు ఎలాంటి అవకాశం ఇవ్వకుండా హైడ్రా కఠిన చర్యలు చేపట్టనుంది.ఈ నిఘా వ్యవస్థను బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ కు కూడా అనుసంధానం చేశారు. దీంతో నగరవ్యాప్తంగా చెరువుల



పరిస్థితిని ఒకేసారి పర్యవేక్షించే అవకాశం ఏర్పడింది. నిఘా మరింత సమర్థవంతంగా మారుతుందని హైడ్రా అధికారులు తెలిపారు. చెరువుల పరిరక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కమిషనర్ రంగనాథ్ పిలుపునిచ్చారు. చెరువులను కాపాడటం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి వనరులను సంరక్షించవచ్చని పేర్కొన్నారు. నగరంలో చెరువుల ఆక్రమణలను పూర్తిగా అరికట్టేందుకు హైడ్రా మరింత కఠిన చర్యలు కొనసాగించనుంది.

# బండి భగీరథ్ పోక్సో కేసుపై సీఎం రేవంత్ ఆగ్రహం

ఘటనపై విచారణ జరిపేందుకు ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేసినట్లు సమాచారం. బాలిక హక్కుల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కమిషన్ తెలిపినట్లు తెలుస్తోంది. పోలీసుల వివరాల ప్రకారం, తన 17 ఏళ్ల కుమార్తెను బండి భగీరథ్ వేధిస్తున్నాడంటూ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోక్సో చట్టంలోని సెక్షన్ 11 రెడ్‌విత్ 12తో పాటు బీఎన్ఎస్ 74, 75 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.మరోవైపు బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులు డబ్బుల కోసం



తనను బెదిరిస్తున్నారంటూ బండి భగీరథ్ కూడా కరీంనగర్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఈ కేసు మరింత సంచలనంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశమవుతోంది. వివిధ రాజకీయ పార్టీలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటుండగా, కేసు దర్యాప్తుపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు తర్వాత విచారణ మరింత వేగం పుంజుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

మెదక్ టుడే
RNI NO: TELTEL/2023/88524
తెలుగు దిన పత్రిక....

# గ్రామీణ మహిళల జీవనోపాధికి కొత్త బలం

**సెర్ప్ పీవీ నరసింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం ఒప్పందం-పాడి, గొర్రెలు, కోళ్ల పెంపకంపై శిక్షణ**
**స్వయం సహాయక సంఘాల మహిళలకు సాంకేతిక సహాయం**

**హైదరాబాద్,మే,11,(మెదక్ టుడే న్యూస్)**గ్రామీణ మహిళల జీవనోపాధిని బలోపేతం చేయడానికి తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ కీలక అడుగు వేసింది. స్వయం సహాయక సంఘాల మహిళలకు పశుసంవర్ధక రంగంలో సాంకేతిక మార్గదర్శకత్వం, శిక్షణ అందించేందుకు సెర్ప్, పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో సోమవారం ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. గ్రామీణ మహిళలకు పాడి పరిశ్రమ, గొర్రెలు మేకల పెంపకం, ఇంటి వద్ద కోళ్ల పెంపకం వంటి రంగాల్లో స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశ్యంగా అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సెర్ప్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి దివ్య దేవరాజన్ మాట్లాడుతూ, పేదరిక నిర్మూలనలో భాగంగా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, నైపుణ్యాభివృద్ధి చేయడం, పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యమని చెప్పారు. స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ సమాఖ్యలు మరింత బలపడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, మైనారిటీ వర్గాలకు బ్యాంకు




అనుసంధానం, రివాల్వింగ్ నిధులు, సబ్సిడీల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తామని వెల్లడించారు. కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్లు, రుణాల ద్వారా గొర్రెల పెంపకం యూనిట్లు, మేక పిల్లల నర్సరీలు, ఇంటి వద్ద కోళ్ల పెంపక యూనిట్లు, క్వయిల్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఒప్పందం కింద వెటర్నరీ విశ్వవిద్యాలయం సాంకేతిక నైపుణ్యం, శిక్షణ, టెక్నాలజీ బదిలీ సేవలను అందించనుంది. అలాగే పశువుల నివాసం, ఆరోగ్య సంరక్షణ, నిర్వహణపై శాస్త్రీయ మార్గదర్శకత్వం కూడా ఇవ్వనుంది.విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఏ శరత్ చంద్ర మాట్లాడుతూ, పాడి పరిశ్రమ, గొర్రెలు మేకల పెంపకం, కోళ్ల నిర్వహణలో సెర్ప్ లబ్ధిదారులకు సాంకేతిక సహాయం అందిస్తామని తెలిపారు. పశువుల్లో పోషకాహార లోపం, ఖనిజాల కొరత ఉత్పాదకతను ప్రభావితం చేస్తోందని పేర్కొన్నారు. పశువుల ఉత్పాదకత పెంచేందుకు ప్రత్యేక ఖనిజ మిశ్రమాన్ని విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిందని, దానిని రైతులకు అందించనున్నట్లు చెప్పారు. అలాగే మాంసం, గుడ్ల ఉత్పత్తికి అనుకూలంగా "రాజశ్రీ" పేరుతో ప్రత్యేక కోళ్ల జాతిని అభివృద్ధి చేసినట్లు శరత్ చంద్ర తెలిపారు. ఈ జాతికి చెందిన పిల్లలను సెర్ప్ ద్వారా గ్రామీణ కుటుంబాలకు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామీణ కుటుంబాల పోషకాహారం, ఆదాయాన్ని పెంచడంలో ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ ఒప్పందం ప్రధానంగా ఆర్థికేతర సహకారంతో కొనసాగనున్నప్పటికీ అవసరమైతే ఆర్థిక సహాయం కూడా అందించనున్నట్లు అధికారులు తెలిపారు.

## యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యం-ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జాబ్ మేళా

**హైదరాబాద్,మే,11,(మెదక్ టుడే న్యూస్)**తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన యువజన, క్రీడల జాబ్ మేళా2026 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలకు చెందిన యువత భారీగా హాజరైంది. జాబ్ మేళాలో పాల్గొన్న యువత వివిధ రంగాలకు చెందిన సంస్థల ప్రతినిధులతో మాట్లాడి ఉపాధి అవకాశాలపై అవగాహన పొందారు. ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, పరిశ్రమల అవసరాలపై ప్రత్యేక సెషన్లు నిర్వహించారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అధికారులు వివరించారు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, తెలంగాణను దేశ నైపుణ్య రాజధానిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. మారుతున్న పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతను సిద్ధం చేయడం





కోసం స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. కొత్త ఉపాధి అవకాశాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. జాబ్ మేళాల ద్వారా ఉద్యోగార్థులు నేరుగా సంస్థలతో కలిసే అవకాశం లభిస్తోందని మంత్రి చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల యువతకు సమాన అవకాశాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. యువతలో నైపుణ్యాలు పెంపొందితే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని అభిప్రాయపడ్డారు.ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాల వల్ల పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన మానవ వనరులు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. భవిష్యత్తు ఉద్యోగ అవకాశాలను దృష్టిలో పెట్టుకుని యువతను సాంకేతికంగా బలోపేతం చేయడం కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ యువతను ప్రపంచ స్థాయి అవకాశాలకు సిద్ధం చేయడంలో ఇటువంటి జాబ్ మేళాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కార్యక్రమంలో పాల్గొన్న పలువురు అభిప్రాయపడ్డారు. రాబోయే రోజుల్లో మరిన్ని జిల్లాల్లో కూడా ఇలాంటి ఉపాధి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

# బొల్లారం అభివృద్ధికి రూ.19 కోట్ల పనులకు శంకుస్థాపన

- **రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నామని మహిపాల్ రెడ్డి వ్యాఖ్య**
- **పలు కాలనీల్లో సీసీ రోడ్లు, యూజీడీ పనులు**
- **ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు**

**సంగారెడ్డి,మే,11,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి):** బొల్లారం డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దుతున్నామని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం బొల్లారం డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్, బీసీ కాలనీ, బీరప్ప బస్తి, గాంధీనగర్, ఐడీఏ కాలనీ, కేబీఆర్ కాలనీ, లక్ష్మీనగర్, శ్రీరామ్ నగర్, వైఎస్ఆర్ కాలనీలలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.19 కోట్ల అంచనా వ్యయంతో సీసీ రోడ్లు, యూజీడీ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈసందర్భంగా మాట్లాడిన మహిపాల్ రెడ్డి, వేగంగా అభివృద్ధి చెందుతున్న బొల్లారం డివిజన్‌లో ప్రతి కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. దశాబ్దాలుగా






అపరిష్కృతంగా ఉన్న తాగునీటి సమస్యను కూడా పరిష్కరించామని చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులకు రూపకల్పన చేయనున్నట్లు వెల్లడించారు. అభివృద్ధిలో రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే ప్రాంత అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు, అధికారులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 10వ ఓపెన్ నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో పటాన్‌చెరు విద్యార్థుల ప్రతిభ

**పటాన్‌చెరు,మే,(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి:**హైదరాబాద్‌లోని పి.వి. నరసింహారావు ఆడిటోరియంలో లక్కీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ ఓపెన్ నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్2026 పోటీలు ఘనంగా జరిగాయి. ఈ పోటీలకు ప్రధాన నిర్వాహకుడిగా షిహాన్ రాజు యాదవ్ వ్యవహరించగా, పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలను అభినందించారు.దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో



పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి పలు పతకాలను కైవసం చేసుకున్నారు. 12 సంవత్సరాల లోపు విభాగంలో పాల్గొన్న విద్యార్థి స్వర్ణ పతకం సాధించగా, మరో విద్యార్థిని అదే విభాగంలో కాంస్య పతకం గెలుచుకుంది.అలాగే నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థి 10 సంవత్సరాల లోపు విభాగంలో స్వర్ణ పతకం, కుమిటే విభాగంలో రజత పతకం సాధించాడు. ఐదో తరగతి విద్యార్థి 12 సంవత్సరాల లోపు విభాగంలో రజత పతకం గెలుచుకున్నాడు.ఈవిద్యార్థులందరూ పోచారం గ్రామానికి చెందిన కరాటే కోచ్ మరియు సీనియర్ మాస్టర్ వద్ద శిక్షణ పొందుతున్నారు. విజేతలను స్థానికులు, తల్లిదండ్రులు అభినందించారు.

### క్యాన్సర్‌ను చూసి భయపడొద్దు

# మెరుగైన చికిత్సతో నయం చేయొచ్చు

**అమీన్‌పూర్,మే,(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి:**ప్రజలు హాస్పిటల్ వరకు





రావాల్సిన అవసరం లేకుండా, బాధితుల వద్దకే నేరుగా వెళ్లి అవగాహన కల్పించాలనే సంకల్పంతో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామని బసవతారక క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ కల్పన రఘునాథన్ తెలిపారు.మేడే వారోత్సవాల ముగింపు సందర్భంగా బీరంగూడలోని భ్రమరాంబికా నగర్ కాలనీలో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్ విజయవంతమైంది. బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, ఈఎస్ఐ, శ్రీ వేద ఆసుపత్రి సంయుక్త సౌజన్యంతో జరిగిన ఈ శిబిరానికి ప్రజల నుండి పెద్ద ఎత్తున స్పందన లభించింది. ఈ సందర్భంగా బసవతారకం హాస్పిటల్ అసోసియేట్ డైరెక్టర్ కల్పన రఘునాథన్ మాట్లాడుతూ.. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వాతావరణ కాలుష్యం మరియు పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేసే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలే క్యాన్సర్ పెరగడానికి ప్రధాన కారణాలన్నారు. కలుషిత ఆహార పదార్థాలు, పని ప్రదేశాల్లోని పరిస్థితులపై తమ సంస్థ నిరంతరం రీసెర్చ్ చేస్తోందని వెల్లడించారు. సీనియర్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రవీనా మాట్లాడుతూ.. ప్రధానంగా మహిళల్లో వచ్చే క్యాన్సర్ల పట్ల వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. "క్యాన్సర్‌ను చూసి భయపడాల్సిన అవసరం లేదు. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయవచ్చు" అని ఆమె సూచించారు. బసవతారక హాస్పిటల్ ప్రత్యేక వాహనం నేరుగా మీ ప్రాంతానికే వస్తుందని, ప్రజలు ఎలాంటి అపోహలు లేకుండా ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. శిబిరంలో మొత్తం 228 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా, వారిలో 100 మంది పురుషులు, 128 మంది మహిళలు ఉన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈఎస్ఐ అధికారుల సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్మికులు, మహిళలు, సామాన్య ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ శిబిరంలో వందలాది మందికి ప్రాథమిక పరీక్షలు నిర్వహించి, తగు జాగ్రత్తలు సూచించారు.

# ధాన్యం తరలింపులో ఆలస్యం ఉండొద్దు

- అధికారులకు కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశాలు
- సేకరణ, రవాణా ప్రక్రియపై సమీక్ష సమావేశం
- రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

**నిర్మల్,మే,11,(మెదక్ టుడే న్యూస్)**కొనుగోలు కేంద్రాల నుంచి వరి ధాన్యం తరలింపు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం సేకరణ, రవాణా ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రైతులు తమ పంటను విక్రయించేందుకు ఇబ్బందులు ఎదుర్కోకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశించారు.ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియలు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. లారీలు, రవాణా సదుపాయాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని




సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదని హెచ్చరించారు. రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు అనంతరం వెంటనే డేటా నమోదు పూర్తి చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చూడాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, లారీ ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యం రైతులకు పూర్తి స్థాయిలో మద్దతు అందించడమేనని పేర్కొన్నారు.

## వడియారం శ్రీ కామాక్షి ఆగ్రో ఇంజనీరింగ్ వర్క్ షాపును ప్రారంభించిన సర్పంచ్ సాయికుమార్ గౌడ్

**చేగుంట,మే,మెదక్ టుడే న్యూస్:**చేగుంట






మండలం వడియారం గ్రామంలో శ్రీ కామాక్షి ఆగ్రో ఇంజనీరింగ్ వర్క్ షాప్ ని గ్రామ సర్పంచ్ సాయికుమార్ గౌడ్ గ్రామ పాలకవర్గం ప్రారంభించడం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ వడియారం గ్రామంలో పాటు చుట్టుపక్కల ఉన్న గ్రామాలు అందరూ ఈ శ్రీ కామాక్షి అగ్రో ఇంజనీరింగ్ వర్క్షాప్ ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇక్కడ ప్రొప్రైటర్ భాస్కర్ ఆధ్వర్యంలో షాప్ నడుస్తుంది వీరు చేసే పనులు ట్రాక్టర్ ట్రాలీలు,వాటర్ ట్యాంకర్లు, కంటివేటేర్స్,కేజీ వీల్స్,జెసిబి బకెట్లు,ఇలా అన్ని రకముల వ్యవసాయ పనిముట్లు మరి ఇతర వెల్డింగ్ లు చేయడం జరుగుతుంది. అందువలన ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాయి కుమార్ గౌడ్, ఉపసర్పంచ్ నాగరాజు, ప్రొప్రైటర్ భాస్కర్, చేగుంట మార్కెట్ కమిటీ డైరెక్టర్లు స్టాలిన్ నరసింహులు, అన్నం ఆంజనేయులు, చేగుంట కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ కాశబోయిన మహేష్ గ్రామ పాలకవర్గం గ్రామ ప్రజలు బంధువులు మిత్రబృందం పాల్గొనడం జరిగినది.

# కాంగ్రెస్ పార్టీ లో చేరికలు

## కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి

**చేగుంట,మే,మెదక్ టుడే న్యూస్:** చేగుంట మండలం ఇబ్రహీంపూర్ గ్రామ పంచాయతీ ఏడుగురు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో చేరడం జరిగింది 1వ వార్డు సభ్యులు మఠం నాగరాజ్ .2వ వార్డ్ సభ్యులు నీల నర్సింలు. 3వ వార్డ్ సభ్యులు చాకలి శ్యామల నవీన్ .4వ వార్డు సభ్యులు నీల మణెమ్మ బిక్షపతి, 5వ వార్డ్ సభ్యులు కుమ్మరి రమ్య రాజు, 6వ వార్డ్ సభ్యులు గుండమైన నవీన్,8వ వార్డు సభ్యులు నెల్లూరి లక్ష్మీ కనకయ్య, వీరందరికి కాంగ్రెస్ కండువా కప్పి



కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి వార్డు సభ్యులు గ్రామ సమస్యలను చెరుకు శ్రీనివాస్ రెడ్డి కి తెలియజేయడం జరిగింది ఇందుకుగాను త్వరలో సుమారుగా 30 లక్షల రూపాయల నిధులను జిల్లా ఇన్చార్జ్ మంత్రి ఆధ్వర్యంలో ఇబ్రహీంపూర్ గ్రామ అభివృద్ధి కొరకు శాంక్షన్ చేయిస్తానంటే తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంద్రుగు సతీష్,ఇబ్రహీంపూర్ ఉపసర్పంచ్ చౌదరి శ్రీనివాస్ చేగుంట ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీ, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని ప్రతి జూనియర్ కళాశాల అభివృద్ధి కలెక్టర్ ప్రతిమసింగ్

**చేగుంట,మే,మెదక్ టుడే న్యూస్:** ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలలో జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాల్గొనడం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి జూనియర్ కళాశాల అభివృద్ధి కొరకై ఇంటర్మీడియట్ బోర్డు నిధులు మంజూరు చేయడం జరిగింది. ఆ



నిధుల ద్వారా కళాశాలలో వివిధ రకాల మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని వివరించారు. విద్యార్థులు కళాశాలలోని అన్ని మౌలిక సదుపాయాలను వినియోగించుకొని మంచి మార్కులు సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శివప్రసాద్, ఇన్చార్జి ఎం పి ఓ ప్రశాంత్, అధ్యాపకులు శ్యాంసుందర్,స్వర్ణలత,ప్రమోద్ కుమార్,వెంకటేశ్వర్లు,అరవింద్ ,బాబు రెడ్డి పాల్గొనడం జరిగింది.

# బండి సంజయ్ కుమారుడి అరెస్టు చేయాలని బీఆర్ఎస్ ఆందోళనలు

## సిరిసిల్ల వ్యాప్తంగా నిరసనలు చేపట్టిన బీఆర్ఎస్ నేతలు
## పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించిన బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్వై
## జిల్లా ఎస్పీకి ఫిర్యాదు అందజేసిన పార్టీ నాయకులు

**సిరిసిల్ల,మే,11,(మెదక్ టుడే న్యూస్)** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. మైనర్ బాలికపై అత్యాచారం జరిగిందంటూ ఆరోపణలు చేస్తూ పార్టీ శ్రేణులు నిరసనలు చేపట్టాయి. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట బీఆర్ఎస్వీ, బీఆర్ఎస్వై నాయకులు ధర్నా నిర్వహించారు. నిందితుడిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు. ఘటనపై ప్రభుత్వం, పోలీసులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాఫ్స్కాబ్ చైర్మన్ కొండూరు






రవీందర్ రావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి గూడూరు ప్రవీణ్, రాష్ట్ర నేత చీటీ నర్సింగరావు, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి తదితరులు పాల్గొన్నారు. ఘటనపై ప్రభుత్వం స్పందించాలని, బాధితురాలికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా తో పాటు మహిళా కౌన్సిలర్లు కూడా ప్రత్యేకంగా మీడియా సమావేశం నిర్వహించారు. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. బాధితురాలి కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలని కోరారు.జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, మహిళా కౌన్సిలర్లు కలిసి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు అందజేశారు. ఘటనపై నిష్పక్షపాత దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారం రాజకీయంగా రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ ఆరోపణలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ లేదా ఆయన కుటుంబ సభ్యుల నుంచి అధికారిక స్పందన వెలువడలేదు. పోలీసులు ఘటనకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

# ధాన్యం కొనుగోళ్లలో ఆలస్యం వద్దు

**జగిత్యాల,మే,(మెదక్ టుడే న్యూస్)** జగిత్యాల జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం మెట్‌పల్లి మండలంలోని ఆత్మకూర్, ఆత్మనగర్, వెల్లుల్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. కేంద్రాల్లో జరుగుతున్న తూకం, నిల్వ, రవాణా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు పూర్తిచేయాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, రైతులకు పూర్తి స్థాయిలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను



ఆదేశించారు. ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియల్లో నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదని కలెక్టర్ హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని కేంద్రాల నిర్వాహకులకు తెలిపారు.కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే డేటా ఎంట్రీ పూర్తి చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు త్వరగా జమయ్యేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే మిల్లుల వద్ద ధాన్యం వేగంగా అన్‌లోడింగ్ అయ్యేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు. రైతులు తమ పంటను ఎక్కువకాలం కేంద్రాల్లో ఉంచాల్సిన పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అకాల వర్షాల కారణంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులకు అవగాహన కల్పించాలని కూడా కలెక్టర్ సూచించారు. చెట్ల కింద, కరెంట్ స్తంభాల వద్ద నిలబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో మండల తహసీల్దార్ నీత, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ మరోసారి స్పష్టం చేశారు.

# తెలంగాణ మహిళా కమిషన్‌లో ఉద్యమకారుల కుటుంబాలకు స్థానం కల్పించడం హర్షణీయం

## ప్రజా ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ కృతజ్ఞతలు

**(స్పెషల్ కరస్పాండెంట్)రంగారెడ్డి జిల్లా,మే,11,మెదక్ టుడే న్యూస్:** తెలంగాణ మహిళా కమిషన్ చైర్మన్‌గా గద్వాల విజయలక్ష్మిని నియమించడంతో పాటు మహిళా కమిషన్ సభ్యులుగా తెలంగాణ ఉద్యమ కుటుంబాలకు చెందిన కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేతలకు అవకాశం కల్పించడం పట్ల తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈసందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ పంది వెంకట్ రాంరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యమకారులకు, అమరవీరుల



కుటుంబాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నిలబెట్టే విధంగా మహిళా కమిషన్‌లో ఉద్యమ కుటుంబాలకు చెందిన వ్యక్తులకు స్థానం కల్పించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. మహిళా కమిషన్ సభ్యులుగా శ్రీకాంత్ ఆచారి తల్లి కాసోజు శంకరమ్మ, అమరవీరురాలు చాకలి ఐలమ్మ కుటుంబానికి చెందిన చిట్యాల శ్వేతలను నియమించడం ద్వారా ప్రభుత్వం ఉద్యమకారుల త్యాగాలను గౌరవించిందని అన్నారు. ఈనియామకాల పట్ల గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలకు తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# బేటీ బచావో, కాదు..బేటేకో బచావో-గా మారిన బీజేపీ

## బండి సంజయ్ కుమారుడు భగీరథపై కఠిన చర్యలు తీసుకోవాలి
## మైనర్ బాలికపై తప్పుడు ప్రచారాలు ఆపాలి
## బీజేపీ నాయకుల తీరుపై బీఆర్ఎస్ నేత రాజా వరప్రసాద్ ఆగ్రహం

**(స్పెషల్ కరస్పాండెంట్)షాద్‌నగర్,మే,11,మెదక్ టుడే న్యూస్:** "బేటీ బచావో" అంటూ నినాదాలు చేసే భారతీయ జనతా పార్టీ ఇప్పుడు "బేటేకో బచావో" పరిస్థితికి దిగజారిందని బీఆర్ఎస్ వ్యవసాయ సహకార సంస్థ మాజీ చైర్మన్ రాజా వరప్రసాద్ తీవ్ర విమర్శలు చేశారు. మహిళల రక్షణ గురించి మాట్లాడే నాయకులే ఇలాంటి ఘటనలపై మౌనం పాటించడం దారుణమన్నారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథపై వచ్చిన ఆరోపణల విషయంలో బాధిత బాలికపైనే ఆరోపణలు మోపడం సిగ్గుచేటని అన్నారు. ఒక మైనర్ బాలికను "హనీ ట్రాప్" పేరుతో దూషించడం ద్వారా అసలు అంశాన్ని మళ్లించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.మైనర్ బాలికపై అసభ్య ప్రచారాలు, వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



రాజకీయ ప్రయోజనాల కోసం బాలికలపై తప్పుడు కథనాలు ప్రచారం చేయడం కూడా తీవ్రమైన నేరమేనన్నారు.బండి సంజయ్ కుమారుడిపై వచ్చిన ఆరోపణలను పూర్తిస్థాయిలో విచారించి, బాధితురాలి వాంగ్మూలాన్ని న్యాయమూర్తి ఎదుట నమోదు చేయాలని ఆయన కోరారు. కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తే బీఆర్ఎస్ తరపున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.మైనర్ల విషయంలో చట్టం కఠినంమైనర్ల రక్షణ విషయంలో చట్టాలు చాలా స్పష్టంగా ఉన్నాయని రాజా వరప్రసాద్ పేర్కొన్నారు. మైనర్ బాలికలతో అనుచిత ప్రవర్తన, అసభ్య సంభాషణలు లేదా లైంగిక వేధింపులు జరిగితే పోక్సో చట్టం వర్తిస్తుందని గుర్తు చేశారు. బాధితురాలు మైనర్ అని తేలిన తర్వాత ఎలాంటి సాకులు చెల్లవని అన్నారు.హనీ ట్రాప్" వంటి వాదనలు చట్టపరంగా నిలబడవని, మైనర్‌తో సంబంధం కొనసాగించడమే ప్రధాన అంశంగా పరిగణిస్తారని తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమేనని, రాజకీయ ప్రభావంతో కేసులను మళ్లించే ప్రయత్నాలు ఆపాలని డిమాండ్ చేశారు.బీజేపీ నాయకులు అంధంగా సమర్థించడం మానుకుని, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై పార్టీ పరంగా కూడా చర్యలు తీసుకోవాలని రాజా వరప్రసాద్ సూచించారు.

# కార్మికుల సంక్షేమమే ప్రజాపాలన ధ్యేయం

- కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్ కమిటీ విస్తృత సమీక్ష
- పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా శాస్త్రీయ వేతన విధానం
- కార్మికులకు గౌరవప్రద జీవనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**హైదరాబాద్,మే,11,(మెదక్ టుడే న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలోని కార్మికుల జీవన ప్రమాణాలను



మెరుగుపరిచేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రంలో కనీస వేతనాల సవరణపై సోమవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్లో కేబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్మికుల సంక్షేమం, పెరుగుతున్న జీవన వ్యయం, కొత్త వేతన విధానాలపై ఈ సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. ఈసమావేశంలో మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, లేబర్ కమిషనర్ దాసరి హరి చందన, ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న కనీస వేతన విధానాలను కూలంకషంగా పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న కొత్త లేబర్ కోడ్ ప్రభావం తెలంగాణపై ఎలా ఉండబోతోందనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. కార్మికులకు చట్టపరమైన రక్షణ, ఉద్యోగ భద్రత, జీవన ప్రమాణాల పెంపు వంటి అంశాలపై అధికారులు నివేదికలు సమర్పించారు.ప్రస్తుతం పెరుగుతున్న ధరలు, ద్రవ్యోల్బణం, నిత్యావసర సరుకుల వ్యయం దృష్ట్యా వేతనాలు కూడా కాలానుగుణంగా పెరగాల్సిన అవసరం ఉందని కమిటీ అభిప్రాయపడింది. కార్మికుల వేతనాలను కేవలం సంఖ్యల పరంగా కాకుండా వారి కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, వైద్య ఖర్చులు, గృహ వ్యయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయించాలని సమావేశంలో చర్చించారు. తెలంగాణలో శాస్త్రీయ విధానంలో కనీస వేతనాలను నిర్ణయించాలని ప్రభుత్వం భావిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ వేతన నమూనాలను అధ్యయనం చేసి తెలంగాణకు అనుకూలమైన విధానాన్ని రూపొందించనున్నట్లు చెప్పారు. కార్మికులకు గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు ఈ వేతన సవరణల ద్వారా ప్రయోజనం చేకూరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిర్మాణ రంగం, పరిశ్రమలు, రవాణా, హోటల్ రంగం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల పరిస్థితులను కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. కార్మికుల సంక్షేమం కేవలం వేతనాల పెంపుతో మాత్రమే పరిమితం కాకుండా, సామాజిక భద్రత, ఆరోగ్య రక్షణ, ఉపాధి స్థిరత్వం, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను కూడా ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి



పేర్కొన్నారు. కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే గౌరవప్రదమైన వేతన వ్యవస్థ అత్యంత కీలకమని అన్నారు. త్వరలోనే కార్మిక సంఘాలు, యాజమాన్యాలు, నిపుణులు, సంబంధిత వర్గాల అభిప్రాయాలను సమగ్రంగా సేకరించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్రాన్ని కార్మికులకు అనుకూలమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోందని తెలిపారు.